క్లుప్తంగా

నేటి నుంచి పశుఆరోగ్య శిబిరాలు

పెనమలూరు: మండలంలో మంగళవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస రావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లా డుతూ ఈ శిబిరాల్లో పశుపోషకులను అవగాహన కల్పించటమే కాకుండా వారికి పలు పథకాలు అమలు చేస్తామన్నారు. పశుపోషకులకు నాణ్య మైన ఇన్‌పుట్ సరఫరా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, లింగ నిర్ధారిత పరీక్షలు, పిండ మార్పిడి పరిజ్ఞానం పై పశుపోషలకులకు అవగాహన క ల్పించి వారికి చేయూతనిస్తామన్నారు. ఈ నెల 21వ తేదీన పోరంకి, పెనమలూరు, 23న కానూరు, చోడవరం, 25న వణుకూరు, యనమలకుదురు, 27న గోసాల, 28న తాడిగ డప, 29న గంగూరు, 30న పెదపులిపాక గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉయ్యూరు: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. మం డలంలోని గండిగుంట గ్రామంలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. గొర్రెలకు టీకాలు వేశారు. పశుపోషకులకు మం దులు పంపిణీ చేశారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు ఈ శిబిరాలను స ద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఉయ్యూరు ఏడీ డాక్టర్ ఎం.రాజశేఖర్, గండిగుంట పశువైద్యాధికారి డాక్టర్ కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తనిఖీ చేశారు. ఆస్పత్రి ఎదుట ఎన్ హెచ్ డ్రెయిన్ చెత్తచెదారం పేరుకుపోవడం గమ నించిన ఆయన వెంటనే పూడికలు తొలగిం చాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పరి సరాలను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల న్నారు. అనంతరం రోగులతో మాట్లాడిన ఆయన ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్ప త్రిగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటు న్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపించినట్లు తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగవచ్చన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేసుల విచారణ వేగంగా పూర్తి చేయాలి

కంకిపాడు: కేసుల విచారణ వేగంగా పూర్తి చేయా లని, సత్వర న్యాయం జరిగేలా చూడాలని గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు ఆదేశిం చారు. కంకిపాడు సర్కిల్ క్రైం రివ్యూ స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల నమోదు, విచారణలో జాప్యం తలెత్తకుండా బాధ్యతతో వ్యవహరించా లన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురే ష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పెనమలూరు: పోరంకిలో వాటర్ ప్లాంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రూ.39 లక్షలతో వాటర్ ప్లాంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, నర్రాచంటి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరులో వృద్ధురాలు అదృ శ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పల్లిపేట రామా లయం వద్ద పామర్తి సుబ్రమణ్యం కటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతడితో తల్లి పామర్తి విజయలక్ష్మి కూడా ఉంటోంది. ఆమెకు మతిస్థి మితం లేక పోవటంతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుమారుడు సుబ్రమణ్యం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వీడని 'వరద' జ్ఞాపకాలు

- అంబాపురంలో ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన మురుగునీరు
- దోమలు, సర్పాలతో ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



అంబాపురం గ్రామం నాలుగో లైన్లో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం ఏ ముహూ ర్తాన అధికారం చేపట్టిందో కానీ కొద్ది రోజులకే బుడ మేరు వరద నీరు అంబాపురం గ్రామాన్ని ముంచెత్తిం ది. వరద ప్రభావానికి ప్రజలు సురక్షితప్రాంతాలకు తరలి వెళ్లారు. పంట పొలాలు ముంపునకు గురై రైతులు నష్టపోయారు. ఆ సంఘటన జరిగి ఐదు నెలలు గడుస్తున్నా అంబాపురం గ్రామం ఒకటో వార్డు ప్రజానీకాన్ని బుడమేరు వరద నీటి చేదు జ్ఞాపకాలు ఇంకా వెంటాడుతున్నాయి. వరదల్లో వచ్చిన బుడ మేరు నీరు అంబాపురం గ్రామంలోని ఖాళీ స్థలాల్లో చేరి మురుగునీరుగా మారి చెరువులను తలపి స్తున్నాయి.

మురుగు నీటిని బైటకు పంపే చర్యలు శూన్యం

నిల్వ ఉన్న నీటిని బైటకు పంపే చర్యలను ప్రభుత్వం చేపట్టకపోవడంతో మురుగునీరు ప్రాణసంకటంగా మారినట్టు ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఖాళీస్థలాల్లోని మురుగునీరు దోమలు, విషసర్పాలకు ఆవాసా కేంద్రాలుగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వృ ద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్య సమస్యలతో సతమత మవుతున్నారు. అంబాపురం గ్రామం విజయవాడ



విక్రమ్ పబ్లిషర్స్ ఎదురు రోడ్డులో చేరిన మురుగు నీరు

నగరానికి ఆనుకుని ఉండటంతో అభివృద్ధి దిశగా విస్తరిస్తోంది. విజయవాడలోని వ్యాపారవర్గాలు ఈ ప్రాంతం వైపు అడుగులు వేస్తూ వ్యాపార సంస్థలు నెలకొల్పుతున్నారు. అయితే డ్రెయినేజీ సిస్టమ్ లేక పోవడంతో వాడుక నీరు ఖాళీ స్థలాల్లోకి చేరుకుని మురుగు కూపాలుగా మారుతున్నాయి.

ఇళ్లల్లోకి వస్తున్న సర్పాలు

మురుగునీటి నుంచి రాత్రి వేళల్లో విషసర్పాలు ఇళ్ల ల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు విజృ ంభిస్తున్నాయి. పందులు కూడా మురుగు కూపాల్లో సంచరిస్తున్నాయి. ఈ సమస్యలపై గ్రామ పంచాయతీ అధికారులకు, పాలకవర్గానికి చెప్పినా పట్టించుకో వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి వాటిని మెరక తోలించే ఏర్పాట్లు చేయాలని కోరినా అధికారులు పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటి నిల్వతో బాధపడుతున్నాం



మురుగునీటి నిల్వతో దోమలు పగలు, రాత్రి తేడా లేకుండా ఇబ్బంది పెడుతున్నాయి. గ్రామ పం చాయతీ అధికారులు మురుగు నీటిని తోడేస్తే దోమల బెడద లేకుండా ఉంటుంది. బుడమేరు వరదల్లో వచ్చిన విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి.

– కె.సాయికుమార్, అంబాపురం

నోటీసులను జారీ చేస్తున్నాం



ఖాళీ స్థలాలను మెరక చేసేందుకు వాటి యజమాను లకు నోటీసులను జారీ చేస్తున్నాం. ఖాళీ స్థలాల యజ మానుల చిరునామాలను తీసుకోవడంలో కొంత ఇబ్బంది పడుతున్నాం. దోమల నివారణకు చర్యలు చేపడతాం.

– డి.శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి

భూముల రీ సర్వేకు సహకరించాలి

ఆర్డీఓ హేలాషారోన్



మాట్లాడుతున్న ఆర్డీఓ హేలాషారోన్

పెనమలూరు: భూముల రీసర్వేకు భూ యజ మానులు సహకరించాలని ఆర్డీఓ హేలాషారోన్ అన్నారు. పెదపులిపాక గ్రామంలో సోమవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ గుంటూరు శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహిం చారు. ఈ సభలో ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వేలో ఎటువంటి వివాదాలు లేకుండా రికార్డు తయారు చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రీసర్వే సం బంధిత భూ యజమాని సమక్షంలో చేస్తారని తెలిపారు. భూ యజమాని అందుబాటులో లేక పోతే క్షేత్రస్థాయి నుంచి వీడియో కాల్‌ద్వారా హద్దులు నిర్ణయిస్తామన్నారు. తహసీల్దార్ కె.గోపా లకృష్ణ మాట్లాడుతూ పెదపులిపాక గ్రామంలో రీ సర్వేకు ఆరు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సహాయకులు ఉంటారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ సర్వేయర్ శివరామప్రసాద్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అరుణ్, మండల సర్వే యర్ శివరామకృష్ణ, ఆర్ఐ భరద్వాజ్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సరికొత్త క్రెటా ఎలక్ట్రిక్ కారు



క్రెటా ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో సోమవారం కొత్త క్రెటా ఎలక్ట్రిక్ కారును ఐసీఐసీఐ బ్యాంక్ కార్ లోన్స్ ఆర్ఎస్ఎం పవన్‌కుమార్, ఎస్బీఐ మేనేజర్ మనోజ్ కుమార్ గ్రోవర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనే జర్ గోపయ్య, ధీరజ్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్ సిం గ్ మాట్లాడుతూ నూతన క్రెటా ఎలక్ట్రిక్ కారులో సమర్థవంతమైన బ్యాటరీ, అత్యాధునిక సాంకే తిక పరిజ్ఞానం, భద్రత సౌకర్యాలతో రూపుదిద్దు కున్నట్లు తెలిపారు. ఈ కారు 17 ఇంచ్ అల్లాయ్ వీల్స్, లెవల్-2 అడాస, అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెం ట్ సిస్టమ్, 70 ప్లస్ స్టాండర్డ్ సేఫ్టీ ఫ్యూచర్స్, కూల్డ్ స్టోరేజ్, సన్‌రూఫ్, ఆకర్షణీయమైన మోనోటోన్ డ్యూయల్ టోన్ రంగులలో లభిస్తుందని తెలి పారు. ఈ కారు ప్రారంభ ధర రూ.17.99 లక్షల నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఏరియాల్లో అభివృద్ధి శూన్యం



నున్న గ్రామ పంచాయతీ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, సభ్యులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం ఎస్సీ కాలనీ(మాదిగపల్లె)లో అభివృద్ధి పనులకు తీర్మానం చేసి మూడున్నళ్లు కావస్తున్నా ఒక్క పని జరగలేదని 11వ వార్డు సభ్యుడు(వైఎస్సార్ సీపీ) ప్రత్తిపాటి సుందరయ్య మండిపడ్డారు. సోమవారం గ్రామ సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన పం చాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యుడు సుందరయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఏరియాలో ప్రజానీకం ఎలాంటి అభివృ ద్ధి నోచుకోలేదన్నారు. ప్రజలు నివసించే ప్రాం తాల్లో కాకుండా జనావాసాలు లేని ప్రాంతాల్లో పనులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ముం దుగా తీర్మానం చేసిన పనులు చేయకుండా కొత్త పనులు ప్రారంభిస్తే తాను ఎస్సీ ప్రజానీకంతో ఉద్యమం చేపట్టేందుకు సిద్ధపడతానని హెచ్చరిం చారు. పంచాయతీ నిధులు రూ.41.90 లక్షలతో నిర్మించిన సిమెంటు ప్రారంభోత్సవానికి పం చాయతీ పాలకవర్గం సభ్యులను ఎందుకు ఆహ్వా నించలేదని వార్డు సభ్యులు సుందరయ్య, వెంకట రెడ్డి ప్రశ్నించారు. అందుకు నిరసనగా తాను నలు పురంగు కండువాతో సమావేశానికి వచ్చినట్లు సభ్యుడు సుందరయ్య తెలిపారు. తాను కొత్తగా వచ్చానని భవిష్యత్‌లో అలా జరగకుండా చూస్తామని కార్యదర్శి డి.శ్రీనివాసరావు సమాధా నం చెప్పారు. ప్రస్తుతం బాగున్న రోడ్లు పైనే రోడ్లు నిర్మించేందుకు మళ్లీ నిధులు మంజూరు చేయడం ఏమిటని సభ్యులు ప్రశ్నించారు. సమావేశంలో ఉప సర్పంచ్ కె. బ్రహ్మానందరెడ్డి, సభ్యులు నాగేం ద్రమ్మ, కిరణ్‌కుమార్, కాటూరి శ్రీనివాసరావు, వెం కటశివ, గంపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యా బోధన



నున్న(విజయవాడరూరల్): ఇంజినీరింగ్, పాలి టెక్నిక్, ఫార్మసీ విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను బోధించడం వలన ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని బెంగళూరుకు చెందిన సీఎంఆర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ పాటిల్ అన్నారు. నున్న గ్రామం వికాస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో విద్యా బోధ నపై ఐదు రోజుల పాటు నిర్వహించిన అవగా హన సదస్సు సోమవారం ముగిసింది. కార్యక్ర మంలో వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్.నర్సి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కిర్తీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పరమేశ్వరరావు, డీన్, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాపులపాడు తహసీల్దార్‌గా మురళీకృష్ణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు తహసీ ల్దార్‌గా బి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వి.నాగభూషణం బదిలీ కావటంతో ఆయన స్థానంలో మురళీకృష్ణ నియమితులయ్యారు. కలె క్టరేట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న మురళీకృష్ణ గతం లో కైకలూరు, విస్సన్నపేట తహసీల్దార్‌గా పనిచే శారు. గత ఏడాది ఆగస్టులో బాపులపాడు తహసీ ల్దార్‌గా విధుల్లో చేరిన వి.నాగభూషణంపై అనూ హ్యంగా బదిలీ వేటు వేయటం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వర్గీయులకు అనుకూలం గా వ్యవహరించకపోవటంతోనే ఆయన్ను సాగ నంపినట్లుగా ప్రచారం జరుగుతోంది.

అక్రమ లేఅవుట్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అం దింది. సామాజిక కార్యకర్త జంపాన శ్రీని వాసగౌడ్ సోమవారం పీజీఆర్ఎస్(మీకోసం)లో ఫిర్యాదు చేస్తూ తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు రోడ్డులో ఆర్ఎస్ నంబర్ 32/2లో 2.66 ఎకరాలు, అలాగే పెదపులిపాక రోడ్డులో ఆర్ఎస్ నంబర్ 74/1ఎ, 74/1బి, 74/సి లో 3.30 ఎకరాల భూమిలో అనధికార లేఅవుట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా అం దిన ఫిర్యాదును తాడిగడప కమిషనర్‌కు కలెక్టర్ కార్యాలయం పంపింది. 15 రోజుల్లో సమస్య పరి ష్కరించాలని ఆదేశించింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రవాణా శాఖ కమిషనర్ మోహన్



మాట్లాడుతున్న మోహన్

పెనమలూరు: ప్రమాదాల నివారణకు వాహనదా రులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రవా ణాశాఖ కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, ఎన్టీఆర్ జిల్లా రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు, సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అర్బన్ ఏరియా ట్రాఫిక్ వాలంటరింగ్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిం చారు. వాహనదారులు వారి ఆలోచన విధానాన్ని మార్చుకుని వేగం కన్నా భద్రతతో ప్రయాణం చాలా ముఖ్యమనే విషయం గుర్తించాలన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ భద్రత నియమాలు పాటించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవ్, మితిమీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం వంటి కార ణాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుం కర రాము మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహ నదారులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ వాలంటరింగ్‌కు 150 మందిని ఎంపిక చేశామన్నారు. పెనమలూరు సీఐ వెంకటరమణ, రవాణాశాఖ ఇన్ స్పెక్టర్ ఎండీ.ఆలీ, రోడ్ సేఫ్టీ ఎస్ఐ ఎస్‌కె. త్రిమూర్తి, రోడ్ సేఫ్టీ మేనేజర్ నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహమ్మద్ ఆలీ

రామవరప్పాడు: యువత అతి వేగంగా వాహనాలు నడపడం వలన ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎన్టీఆర్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ మోటార్ వెహి కల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఆలీ అన్నారు. విజయవాడరూ రల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాల్లో సోమవారం నెహ్రూ యువకేంద్రం , ట్రాఫిక్ డిపార్టుమెంట్, రవాణా శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించ డానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుం టోందని తెలిపారు. జిల్లా యువ అధికారి సుంకర రాము, రోడ్ సేఫ్టీ ఎస్ఐ త్రిమూర్తులు, పెనమలూరు సీఐ వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో అన్నసంతర్పణ



అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ పవన్ కిషోర్ తదితరులు

రామవరప్పాడు : స్థానిక శ్రీ వెంకమ్మ పేరం టాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనం గా ముగిసిన సందర్భంగా సోమవారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ మండలం పలు గ్రామాల్లోని సుమారు వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణా ధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ రామవర ప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, గ్రామ పెద్దల సహకారంతో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా పూర్తి చేశామన్నారు. అన్నసంతర్పణ కార్యక్రమా నికి కూడా ఇరు గ్రామాల పెద్దలు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రామవర ప్పాడు, ప్రసాదంపాడు గ్రామాలతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అమ్మవార్ల అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పటమట సీఐ పవన్ కిషోర్, మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనం ద్‌కుమార్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలి



ఉప్పలూరులో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కంకిపాడు: పశువులు, జీవాల పెంపకంలో మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలని ఈడుపుగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ కర్నాటి మాధవరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఉప్ప లూరు, ప్రొద్దుటూరు గ్రామాల్లో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఉప్పలూరు శిబిరంలో 200 గొర్రెలు, 100 పశువులకు పశువైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. గొర్రెలకు బొబ్బ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు లాం పార్వతి పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో నిర్వహిం చిన శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

నేడు తెన్నేరు, దావులూరు గ్రామాల్లో..

మండలంలోని తెన్నేరు, దావులూరు గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించను న్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో పశుపోషకులు, జీవాల పెంపకందా రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్ల నిరసన ప్రదర్శన



కానూరులో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపాలిటీ కార్మికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న వ్యాన్ డ్రైవర్లకు మూడు నెల లుగా జీతాలు ఇవ్వలేదని డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మి కులు కానూరులో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తడిచెత్త- పొడి చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు జీతాలు సక్రమం గా చెల్లించటం లేదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే బోడెప్రసాద్‌ను కార్మికులు కలిసినప్పుడు రూ.70 లక్షల బిల్లు వెంటనే చెల్లిస్తామని కమిషనర్ భవానిప్ర సాద్‌తో మాట్లాడి చెప్పారన్నారు. అయితే నేటికీ జీతం ఇవ్వలేవని ఆరోపించారు. సమ్మె ప్రారంభించి ఇప్ప టికి రెండు వారాలు గడిచిందని, ఇప్పటికైనా అధికా రులు స్పందించాలన్నారు. లేని పక్షంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్ వలి, వెంకటరెడ్డి, శ్రీహరి, సత్రం శ్రీను, లింగయ్య, ఏసుకుమారి, ఉప్పు లక్ష్మి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామికి సప్తస్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పడమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. సోమవారం కార్యక్రమాలు హరిద్రా మ్యూజిక్ అకాడమీ బృ ందం, పామర్తి కార్తీక, విజయనగరానికి చెందిన చొప్పల్లి సం తోష్‌కుమార్, భాగవతుల వంశీకృష్ణ శివాత్మిక, హైదరాబాద్‌కు చెందిన పూడిపెద్ది రాధాకృష్ణ, నోరి సోదరీ మణులు, మల్లాది కార్తీక త్రివేణి, తుషార పూర్ణవల్లి తది తరులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. యువ సంగీత కళాకారుడు ఎస్.వనమాలి వేణువుపై త్యాగరాజ స్వామి రచించిన శ్రీగణనాథం, నిరవది సుఖదా, మారవైరి, నీవల్లగుణదోషమేమి తదితర కీర్తనలు పలికించారు. వయో లిన్‌పై సుబ్రహ్మమణ్యరాజు, మృదంగంపై వినుష్ సహక రించారు. హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు యనమండ్ర శ్రీనివాస శర్మ, యనమండ్రవేణు గోపాల శాస్త్రి పర్యవేక్షించారు.

కళాకారుల సంక్షేమానికి కృషి



రత్నకుమారిని సత్కరిస్తున్న విజయలక్ష్మి, వెంకటరమణ తదితరులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళా కారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సూచించారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం దాసరి కళాపీఠం తొమ్మిదవ వార్షికోత్సవం, సినీ సంగీత విభావరి, గాయని రత్నకుమారికి ఆ త్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ దాసరి కళాపీఠం చేస్తున్న సేవలను అభినందించారు. దాసరి కళా పీఠం అధ్యక్షుడు దాసరి వెంకటరమణ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు మూర్తి రాజు మాట్లాడుతూ దర్శకుడు దాసరి నారాయణరావు ఎన్నో విజయవంతమైన చిత్రా లను నిర్మించి దర్శకత్వం వహించినట్లు తెలి పారు. అనంతరం సీనియర్ గాయని రత్నకుమా రిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ప్రసూనారామన్, టీ శ్రీనివాసరెడ్డి దాసరి సినీ రంగసేవలను వివరించారు. డేవిడ్‌రాజు, రత్నకు మారి, సయ్యద్ ఆలీ, బెల్లంకొండ భారతి, సుశీల్ కుమార్ చిత్ర గీతాలను ఆలపించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

పెనమలూరు: మత్తు పదా ర్థాలకు విద్యార్థులు దూరం గా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనే జర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలుగా మారితే జీవితం అంధకారంగా మారుతుందన్నారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ చెడు స్నేహాలు చేయరాదన్నారు. మద్యం, గుట్కాకు అలవాటు కావద్దని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జె.జ్యోతిచంద్రిక, హెచ్ఎం ఎ.కనకదుర్గ, షేక్ నజ్మా, డి.విజయరాణి పాల్గొన్నారు.